నూతన వధూవరులకు ఆశీర్వాదం

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

రాయపోల్, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మండల ఉపాధ్యక్షుడు కర్నాల సత్యనారాయణ కుమార్తె హర్ష, రమేశ్ వివాహం గురువారం ప్రజ్ఞాగార్డెన్‌లో జరుగగా, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట దౌల్తాబాద్ మండల మాజీ ఏఎంసీ చైర్మన్ పడకంటి శ్రీనివాస్ గుప్తా, జడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకులు ఇప్ప దయాకర్, కల్లూరి శ్రీనివాస్, కొత్తపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాసరి బాల్‌నర్స్, బాల్‌రాజ్, తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

గజ్వేల్, ఏప్రిల్ 18 : అగ్ని ప్రమాదాల నివారణకు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందుకు ప్రతి ఒక్కరూ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి సురేశ్ అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఇండియన్ గ్యాస్ గోదాంను సందర్శించగా, అక్కడ అగ్నిమాపక నిరోధన యంత్రాలు సరిగ్గా పనిచేయకపోవడంలో వెంటనే నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు వాటిని ఎదుర్కొనే విధంగా ఉండాలన్నారు. గజ్వేల్ అగ్నిమాపక కేంద్ర అధికారి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ గోదాం వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

వెద సాగుపై క్షేత్రస్థాయి ప్రదర్శన

ఎర్రవల్లిలో తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, డీలర్లు

మర్కూక్, ఏప్రిల్ 18 : మర్కూక్ మండలంలోని ఎర్రవల్లిలో వెద సాగు, ఆయిల్ పామ్ తోటలపై గురువారం సిద్దిపేట డీలర్లకు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించామని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెద సాగు వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు సరైన సమయంలో విత్తనం వేసుకోవడానికి అనుకూల పరిస్థితులు ఉంటాయని, సాధారణ పద్ధతితో పోలిస్తే దిగుబడి కూడా 2 నుంచి 3 క్వింటాళ్లు ఎక్కువగా వస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, రైతులు డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

గజ్వేల్, ఏప్రిల్ 18 : ఎర్రటి ఎండకు తల్లడిల్లుతున్న ఉపాధి హామీ కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి అన్నారు. గురువారం భారత రాజ్యంగ పరిరక్షణ ప్రచారోద్యమంలో భాగంగా మండల పరిధిలోని అక్కారంలో ఉపాధి కూలీల పని ప్రదేశానికి వెళ్లిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పని ప్రదేశంలో తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేవని అరకొర ప్రాథమిక చికిత్స బాక్సులున్నయన్నారు. ప్రతి పని ప్రదేశం వద్ద కనీస సౌకర్యాలు కల్పించి వారి హక్కులను కాపాడాలన్నారు.

అక్కారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎగొండస్వామి

ఎన్నికలకు సహకరించాలి

మిరుదొడ్డిలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్

మిరుదొడ్డి, ఏప్రిల్ 18 : మే 13న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పల్లెల్లోని ప్రజలు సహకరించాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చు నిర్వహించారు. మిరుదొడ్డి, భూంపల్లి, దుబ్బాక ఎస్సైలు పరుశ రాములు, రవికాంత రావు, గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దొమ్మటలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న అగాపే ట్రస్ట్ సభ్యులు

రాయపోల్, ఏప్రిల్ 18 : దౌల్తాబాద్ మండలం దొమ్మట గ్రామానికి చెందిన భూంపల్లి చర్చి ఫాస్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బాణాల దాసు తండ్రి ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి అగాపే ట్రస్ట్ గురువారం రూ.15 వేల ఆర్థిక సాయంతో పాటు బియ్యాన్ని అందజేసింది. నర్ర నవీన్ కుమార్, నర్ర రాజేందర్, రాగి ప్రభు, రాకేష్, నరేశ్, శ్రీనివాస్, దివాకర్, జ్ఞాన్‌రాజు, నవీన్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నిర్వహణ, నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి అధికారులకు సూచించారు. గురువారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో హుస్నాబాద్ నియోకవర్గ సెక్టోరియల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గంలో 304పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో ఎన్నికల నిర్వహణకు కావాల్సిన సౌకర్యాలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగు నీరు, వైద్య సదుపాయం, అవసరమైతే చలువ పందిళ్లు, టెంట్లు వేసేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. హుస్నాబాద్‌లోని టీఎస్ మోడల్ స్కూల్‌లో స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు చేశామని, త్వరలోనే ఈవీఎంలు కూడా స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుతాయన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు ముందస్తుగానే చేరుకోవాల్సి ఉంటుందని, ఎన్నికల సిబ్బంది ఎన్నికల నియమావళిని అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. ఓటర్లకు ఏ సమస్య ఉన్నా సీ-విజిల్ యాప్ ద్వారా నేరుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చన్నారు. సీ-విజిల్ వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, సురేఖ, మంజుల, ఎన్నికల డీటీ రుక్మిణి, మహ్మద్ రజాక్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

అనుమానాలను నివృత్తి చేసుకోవాలి

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినందున నామినేషన్ల దాఖలులో ఎలాంటి అనుమానాలు ఉన్నా ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రామ్మూర్తి అన్నారు. గురువారం ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఆర్డీవో, తహసీల్‌లోని నోటీసు బోర్డులపై ప్రదర్శనకు పెట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు సమయం ఉన్నందున నామినేషన్ ఫామ్స్ విషయంలో గానీ ఇతర నిబంధనలలో గానీ ఎలాంటి అనుమానాలు ఉన్నా నివృత్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మే 13న ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

మత్స్య సంపదకు 'కౌలు శిస్తు' చెల్లించాల్సిందే..

చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 18 : అందుబాటులో ఉన్న చెరువులు, కుంటల్లో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు శాపంగా మారుతున్నాయి. మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వివిధ గ్రామాల్లోని చెరువు, కుంటల్లో చేపలు పట్టుకునేందుకు శిస్తును చెల్లించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు నోటీసులు జారీ చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మత్స్య సంపదకు నోటీసులు జారీ చేయడమేమిటని మత్స్యకారులు విస్తుపోతున్నారు. ఈ ప్రభుత్వం చిన్నచిన్న చెరువులు, కుంటల్లో అరకొరగా దొరికే చేపలకు పెద్ద మొత్తంలో శిస్తు చెల్లించాలంటే ఎలా చెల్లించేదని ఆందోళన చెందుతున్నారు. గతంలో స్థానిక గ్రామ పంచాయతీలకు సాధారణంగా కొంత మొత్తంలోనే శిస్తు కట్టే వాళ్లమని గుర్తు చేశారు. దీనికితోడు ఇటీవల సభ్యత్వ రుసుం కింద రూ. 2500లు తీసుకుంటున్నారని, ఆడిటింగ్ సమయంలో కూడా సొసైటీలకు పెద్ద మొత్తంలో ఖర్చులు అవుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నోటీసులు జారీ చేసిన మత్స్యశాఖ

మత్స్య సంపదకు శిస్తు కట్టలేం..

కేసీఆర్ ప్రభుత్వం చెరువులు, కుంటల్లో ఉచితంగా చేపపిల్లలను వేసి మత్స్యకారులకు జీవనోపాధిని చూపించింది. చేపలను అమ్ముకునేందుకు వీలు గా వాహనాలను కూడా ఇచ్చింది. ఈ ప్రభుత్వం మాత్రం మత్స్య సంపదకు శిస్తు కట్టమని నోటీసులు పంపుతున్నది. మత్స్య సంపదకు తాము శిస్తును కట్టలేం. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేనిపక్షంలో మత్స్యకారుల మంతా ఆందోళనలకు దిగుతాం.

-నందనబోయిన నర్సింహులు ముదిరాజ్, ఎంపీటీసీ బైరాన్‌పల్లి

వడ్డేపల్లిలో సీతారాముల రథోత్సవం

రాయపోల్ మండలం వడ్డేపల్లిలో సీతారాముల రథాన్ని లాగుతున్న భక్తులు

రాయపోల్, ఏప్రిల్ 18 : రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో గురువారం ఉదయం స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని గ్రామంలోని వీధుల్లో రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీసి పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

'నక్షత్రకోట' పుస్తకం ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యాదవరెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 18 : రచయిత బైతి దుర్గయ్య రాసిన బాలల కథల సంపుటి నక్షత్రకోట పుస్తకాన్ని మండల విద్యాధికారి యాదవరెడ్డి సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల సాహిత్యం మధురమని బాలల కథలు బాలలకు చేరాలని యాదవరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి సయ్యద్ షౌకత్ అలీ, అధ్యాపకులు చెన్నాకృష్ణరెడ్డి,యాదగిరి, రాజు, అశోక్‌కుమార్, నవీన్, బాలసాహిత్య రచయితలు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు ఆర్థికంగా ఎదగాలి

గజ్వేల్, ఏప్రిల్ 18 : మున్నూరు కాపులు ఆర్థికంగా రాజకీయంగా సంఘటితమై ఎదగాలని, ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని మున్నూరు కాపు సంఘం గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల నరేశ్ బాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని బెజుగామలో మున్నూరు కాపు కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు చందా నర్సింహులు, కార్యదర్శి బండ్లస్వామి, గంగిశెట్టి నర్సింహులు, బాదే నర్సింహులు, ఆకులు శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొ న్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల నరేశ్‌బాబు

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 18 : మద్దూరు మండల కేంద్రంలోని రామాలయంలో గురువారం శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు పానుగంటి తిరుపతయ్య వైదిక నిర్వహణలో పట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అంతకు ముందు ఆలయంలో భక్తులు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు.

శ్రీ రామ పట్టాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు పానుగంటి తిరుపతయ్య

కన్నుల పండువగా కల్యాణం

గురువన్నపేటలో పుట్టకమ్మేందుకు వెళ్తున్న బోనం కృష్ణం స్వామి, తదితరులు

కొమురవెల్లి, ఏప్రిల్ 18: మండలంలోని గురువన్నపేటలో ముదిరాజుల కులదైవం పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవ వేడుకలు బోనం కృష్ణం స్వామి, మదిరాజు కులస్తుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరుగుతున్నాయి. గురువారం డప్పుచప్పుళ్లతో శివ సత్తుల పునకాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గంగతెప్ప, పుట్ట కమ్ముట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

సిద్దిపేట, ఏప్రిల్ 18 : ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐపీ, ఓపీ సేవలను పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు ప్రభుత్వ అమలు చేస్తున్న కార్యక్రమాలు తీరును పరిశీలించారు. ప్రజల్లో కుటుంబ నియంత్రణ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ చర్యలు అంటువ్యాధులపై అవగాహన, ఆరోగ్యం ఎలా క్లినిక్ నిర్వహణ తదితర అంశాలపై సదస్సు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం దవాఖాన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి సాయికిరణ్, జీఎన్ఎం గాల మ్మ, సిబ్బంది సరిత, సంగీత, భిక్షపతి రమే శ్, నవీన్ ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

గజ్వేల్, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని దిలాల్‌పూర్ లక్ష్మీ నర్సింహస్వామిని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ పూజారులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, రాములు, గోపాల్‌రావు, లక్ష్మయ్య, రాజు, సురేశ్ పాల్గొన్నారు. అనంతరం గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరాం నర్సింహులు అనారోగ్యంతో బాధపడుతూ కొన్ని రోజుల కింద మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు బలరాంగౌడ్, రమేశ్‌గౌడ్ క్వింటాల్ బి యాన్ని అందజేశారు.

నర్సారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ పూజారులు

జీవనోపాధికి చేయూత

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 18 : మహిళలు స్వశక్తితో ఎదగాలని సెట్విన్ జిల్లా కో-ఆర్డినేటర్ అమీనా అన్నారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ, పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో స్నేహిత మహిళా సహాయ కేంద్రంలో ఆరుగురి మహిళలకు జీవనోపాధి నిమిత్తం ఒక్కొక్కరికీ రూ. పది వేలు చొప్పున స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహకురాలు శివకుమారితో కలిసి గురువారం అందజేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఆత్మ రాములు, తదితరులు ఉన్నారు.

వృథాగా 'భగీరథ' జలం

చేర్యాల పట్టణంలో వృథాగా పోతున్న భగీరథ నీళ్లు

చేర్యాల, ఏప్రిల్ 18 : పట్టణంలోని ఏపీజీవీబీ ఎదురుగా 10 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతుండడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేర్యాలలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులతో నిత్యం పట్టణంలో ఏదో ఒక చోట మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి ఆయా ప్రదేశాలకు నీటి సరఫరా నిలిచిపోవడం జరుగుతున్నది. నిత్యం తమ భవనం ఎదుట నీరు వృథాగా పోతుండడంతో ఆ ప్రదేశంలో నీరు నిలిచి గుంటగా ఏర్పడి ఇబ్బందులు పడుతున్నామని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కుర్రారం బాల్‌నర్సయ్య, స్థానికులు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు పైపులైన్లు మరమ్మతులు చేసి నీరు వృథా నీటిని అరికట్టాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యురాలికి గాయాలు

చేర్యాల, ఏప్రిల్ 18 : పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో డాక్టర్‌గా విధులు నిర్వహించే కాశెట్టి మంజుల గురువారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. వైద్యురాలు స్వగ్రామమైన మండలంలోని గుర్జకుంట గ్రామం నుంచి ప్రభుత్వ దవాఖానలో విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై చేర్యాల పట్టణానికి వస్తున్న క్రమంలో మరో ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టింది. దీంతో డాక్టర్ మంజుల గాయపడడంతో చేర్యాల దవాఖానలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట దవాఖానకు తరలించారు.

బిల్ కలెక్టర్లకు సన్మానం

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 18 : తమకు అప్పగించిన పనిని పూర్తిస్థాయిలో నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆస్తి పన్ను 86 శాతం వసూలు చేసిన మున్సిపల్ బిల్‌కలెక్టర్లను ఘనంగా సన్మానించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్, బిల్ కలెక్టర్లు ఎల్లయ్య, రాజమౌళి, నరేశ్, సతీశ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేసి కాంగ్రెస్ ఓట్లు అడుగాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 18 : కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఝూటా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూరుగోజు నాగరాజు అన్నారు. గురువారం కొమురవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ శ్రేణులతో కలిసి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినే వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు, మహిళలకు రూ. 2500, ఫించన్ రూ.4 వేలు, రైతులకు క్వింటాళుకు రూ.500 బోనాస్ ఇస్తామని ఇప్పటికీ ఒక్క హామీ అమలు చేయలేదని ఆ హామీలన్నీ అమలు చేసి కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీజేపీ నేతల పాల్గొన్నారు.

నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

శివాలయ నిర్మాణానికి భూమి పూజ

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 18 : మద్దూరు మండలంలోని సలాఖపూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో దాతల సాయంతో చేపట్టిన శివాలయ నిర్మాణ పనులకు గురువారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు రవీందర్ శర్మ, మాజీ సర్పంచ్ వంగ భాస్కర్‌రెడ్డి, ప్రధానదాత కాడి జయమ్మ-బాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

26,27న జాతీయ కార్యశాల

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 18 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27న అధునాతన క్రోమోటోగ్రాఫిక్ పద్ధతులపై జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. రెండు రోజుల పాటు జరిగే కార్యశాల కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నిర్వహించే జాతీయ కార్యశాల విద్యార్థులకు,అధ్యాపకులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.